సామాన్యంగా మన దేశంలో సంపాదించటమనేది మగవాళ్ళ బాధ్యతై పోయింది వాస్తవంగా ఎంత రెండు చేతులా, విరివిగా సంపాదించినప్పటికీ సంపాగించటంలో చూపించిన నేర్పరితనాన్ని, మెలుకువనీ, దాచివుంచడంలో చూపించకపోతే, సంపాదనయొక్క విలువ ఏముంటుంది? సంపాదించింది దాచి పెట్టాలనే ఆరాటం చాలా మందికి జాస్తిగా ఉన్నా ఏకొద్ది మందికో తప్ప మగవాళ్ళల్లో నిలవ చేయటం సాధ్యంకాదు మా కుటుంబాలలో వున్న కిటుకేమిటంటే సంపాదించటం మగవాళ్ళ వంతైనప్పటికీ దాచి వుంచడం విషయంలో మా ఆడవాళ్ళు ప్రత్యేకమైన అధికారాన్ని వినియోగించుకొని భద్రపరుస్తారు అక్కడ మగవాళ్ళు ఒకవిధమైనబాని సత్వాన్ని అనుభవానికి తెచ్చుకోవాల్సిందే! ఈ ఆచారం మా కుటుంబాలలో అనాది నుంచీ వస్తూండటం వల్ల ఊళ్ళోవాళ్ళు "ఆడపెత్తనం" అని మా కుటుంబాలను గేలి చేయటం అమల్లో వుంది కానీ అందుకు మామగవాళ్ళు అంతగా చింతిల్లే వారుకాదు. ఆఒక్క విషయంలో మినహాయించి సాంఘిక వ్యవహారాదులలో మగవాళ్ళదే పెత్తనం అధికారం. సంపాదించే విషయంలో ఆడవాళ్ళు మా మగవాళ్ళకు సలహా లివ్వటం కూడా కద్దు అంతటితో తృప్తి చెందని వాళ్ళు తమసలహాలను పాటించేట్టు ఒత్తిడి పెట్టటం కొత్త కాదు కాని మళ్ళీ ఒక న్యాయం ఉంది ఆసంపాదించటం అక్రమంగానూ అధర్మంగానూ, - ఎదుటి వాళ్ళకు అపకారం చేస్తూ, అంటే గిట్టను అది కేవలం పాపంతో కూడుకున్నది కనుక మా వాళ్ళు ఆదారుణానికి పాల్పడరు ధర్మంగా వొచ్చే ఆదాయంలో ఖర్చు తగ్గించుకొంటే అదిఒక రకమైన సంపాదన అనిపించుకోకుండాపోదు చూడండి ఈ నిండు యవ్వనంలో వున్న యువకుడికి అందమైన స్త్రీని చూస్తే నరాలలో కలిగే జ్వరంలాంటిదే - మధ్యవయస్కులైనవాళ్ళకీ, అంతకు పైవయస్కులకే ధనాన్ని చూస్తే నరాలలోజ్వరం బయలు దేరుతుంది. తృప్తికి మితం వుండదు ఎట్లానైనా, ఏపని చేసైనా, ధర్మా ధర్మాలు, నీతి అవినీతులు త్యజించి — మోసాన్ని, అసూయనీ పెంచుకొని, సంపాదించాలి! గమ్మత్తైమిటంటే, ఈ ఆశయంతో సంపాదిస్తూనే, తాము ధర్మంగా సంపాదిస్తున్నామనే గుడ్డినమ్మకానికి చాలామంది గురిఅవుతూ చాటుకుంటారు. శరీరం ఎట్లా అశాశ్వితమైనదో చివరకు డబ్బుకూడా అల్లాంటిదేననీ, పోతూ పోతూ కట్టుకుపోయేది ఏమీ ఉండదనీ తెలిసికూడా వంచనచేస్తూ బీదవాళ్ళ కడుపుల్ని తుప్పు కత్తులతో కెలుకుతూ - సంపాదించడం మానరు, ఈ మనుష్యులు. మా తాత తండ్రిది నూటయాభై ఎకరాల నిక్షేపమైనభూమి అటువంటిది మా తాత పంచుకొనేప్పటికి యాభైఎకరాలు వచ్చింది ఒర్పుతో సామర్థ్యంతో మా తాత దాన్ని తండ్రి హయాములో ఉన్న ఆస్తితో జతపరిచాడు. మా తాతకు ఏడుగురు మగపిల్లలలు, ఇద్దరు ఆడపిల్లలు. భాగాలు పంచుకొనేటప్పటికి ఇరవై ఎకరాలు వచ్చింది మా నాన్న ఎందువల్లనో సంపాయించ లేకపోయాడు మళ్ళీ ఇప్పుడు మేము ఏడుగురు అన్నదమ్ములం. రేపు నాలుగేళ్ళు పోయిన తరువాత భాగాలు పంచుకొంటే — ఒక్కొక్కరికి రెండెకరాలకు మించిరాదు ఇట్లా గొప్పఆస్తులు కూడా తరతరాలుగా తరిగిపోతూంటవి. అప్పట్లో మా వూళ్ళొ శివరామయ్యకు తండ్రులు

"సులోచన"

సంపాదన

సంపాదించిందీ తాతలు సంపాదించిందీ, ముత్తాతలు సంపాదించిందీ, అంతా అంటే, పిల్లలు లేకపోవటం మూలాన మూడువందల ఎకరాలభూమి, లక్షరూపాయల ధనమూ ఉండేదిట శివరామయ్య పోకిరీగా తిరిగి చాలావరకు ఆస్తిని ధ్వంసపరిచాడు. అతని కొడుకు సినిమాలు తీసేవాళ్ళతో తిరిగి మిగిలిన ఆస్తినంతా ఖర్చుచేశాడు. సంపాదంచటం సంవత్సరం పట్టితే ఆ సంపాదన ఖర్చుచేయటం అయిదు రోజులు పట్టదు.

మా ఉష కొత్తగా కాపురానికి వెళ్ళింది. మా ఉషను కాపురానికి పంపించటంలో మా అత్తయ్యా, మామయ్యాలు తీసుకున్న శ్రద్ధ, చేసిన ఆర్భాటం - నిజంగా వాళ్ళకు ఉషమీద వున్న సిసలైన ప్రేమ, అభిమానం ప్రకారం పట్టిచూస్తే 'ప్చ్' అనిపించక తప్పదు. తాహతుకు తగినట్టు ఏమీ చెయ్యలేదు అందుకు బలమైన కారణం ఏమిటంటే, అనవసరంగా ఆర్భాటాలకు డబ్బు ఖర్చు పెట్టటం దేనికనీ ఈఅభిప్రాయం వాళ్ళలో మొదట్నుంచి ఉన్నది. ప్రతి విషయంలోనూ ఈ అభిప్రాయాన్ని మనస్సులో పెట్టుకొనే వాళ్ళు ఉషని పదహారేళ్ళ వరకూ ప్రాణప్రదంగా పెంచి, అయిదెకరాల పొలం పదివేల కట్నంతో ఒక ఇరవై ఎకరాల వాడికి, ఇంజనీరింగ్ ప్యాసైన వాడికి ఇచ్చి పెళ్ళి చేశారు కాని పెళ్ళి కాస్త ఆర్భాటంగానే చేయవలసి వొచ్చి, చేశారు, అవతల వాళ్ళవొత్తిడి వల్ల

కాపురానికి వెళ్ళిన నెలరోజులకే కాంతారావుకు విజయవాడలో ఉద్యోగమైంది. నెలకు రెండువందల యాభై రూపాయలు ఉష అదృష్టమని మావాళ్ళు అనుకొంటే మా అబ్బాయి అదృష్టమని వాళ్ళ వాళ్ళు అనుకున్నారు. మా అత్తయ్యా, మామయ్యా వాళ్ళు తమ అల్లుడికి అయిన పెద్ద ఉద్యోగాన్ని గురించి ఊళ్ళో చెప్పుకోలేక సతమతమయ్యారు. ఉషభర్త దగ్గరే ఉంటూన్నది, విజయవాడలో ఉష కొడుకు కాపురాన్ని సరిదిద్దటానికి కాంతారావు తల్లి కూడాఅక్కడే ఉంటున్నది అవిడ కోడల్ని తనక్రింద పనిమనిషిగా చేసుకోవటానికి ఎక్కువ రోజులు పట్టలేదంటే అందుకు కారణం మా ఉష మెత్తదనం వల్లనే మా అత్తయ్య, మామయ్యలు, ఆమెను అట్లా తయారు చేశారు. పిల్ల తమకు ఎదురు చెప్పకుండా వుండటానికి ఎంత మెలకువగా పెంచాలో అంత మెలకువగా పెంచారు.

కాంతరావు తల్లి ఒక గీటుగీచి ఆ గీటు దాటగూడదని కోడల్ని శాసించింది సరేనన్నది, మా ఉష. ఆ గీటు దాటగూడదనటంలోని ముఖ్యసారాంశ మేమిటంటే ఏపరిస్థులలోనైనా రాగికాసేని, వెండి రూపాయిగా చూసుకోవాలని ఇట్లా చూసుకోవటం ఉషకి కంటకంగా తోచలేదు. ఆ విద్య ఆమెకు మా అత్తయ్యా, మామయ్యల దగ్గర నేర్చుకున్నదే! పైపెచ్చు ఉష తన చాకచక్యాన్ని ప్రదర్శించి మెప్పును కూడా పొందవచ్చు.

కాంతారావు అసమర్ధుడుకాడు పెత్తనం తల్లికి వొప్పజెప్పడంలో తను దాస్యాన్ని కోరుతున్నట్టు అతను భావించలేదు నంపాదించటం తనవంతు. దాచిపెట్టటం తల్లివంతు ఏనెల జీతం ఆనెల రెండో తారీఖు పదిరూపాయలు తన ఖర్చుకు అట్టేపెట్టుకుని తల్లికి ఇచ్చేవాడు. తల్లి మురుసుకొనేది.

ఉషకు గర్భం వొచ్చింది ఏడోనెలరాగానే మా అత్తయ్య తనఇంటికి తీసుకు వొచ్చింది, పురుడు పోయటానికి. పదోనెలని ఉషకు మగపిల్లవాడు కలిగాడు కాంతారావూ, తల్లీ చూడటానికి వచ్చారు. పోలికలు ఎక్కువ భాగం తండ్రివే. బారసాల అవీ బాగానే చేశారు శివన్నారాయణ అని పేరు పెట్టారు. అది కాంతారావు తాత పేరు.

మూడో నెలరాగానే ఉష విజయవాడ వచ్చింది తోడుగా మా అత్తయ్య కూడా వచ్చి, నెలరోజులు వుండి పోయింది.

* * *

ఉద్యోగంలో నాలుగైదు సంవత్సరాల సర్వీసు సంపాదించేప్పటికి కాంతారావులో చాలా మార్పులు వొచ్చాయి అతని జీవితంలో ఆమార్పులు కలుగటానికి కేవలం పరిస్థితులే కారణమని అతను తృప్తి పడటానికి భావించినా, అవి అంత బలవత్తరమైనది కావు. నిజానికి కాతారావు పరిస్థితుల వారసుడు కొనక్కర్లేదు సహం అతనిలో రేగినభయమే అట్లా చేసింది ముగ్గురు పిల్లలు రాను రాను సంసారం ఎదిగి పోతూన్నది, మరి అందుకు తగినట్లుగా

సంపాదన ఉండొద్దూ! లంచాలు తీసుకోవటం ఆరంభించాడు. అధర్మ సంపాదన. ఇట్లా సంపాదించటం వంశంలో కొత్త. తల్లీ, భార్యా మొదట్లో అడ్డుచెప్పినా కొన్ని కారణాలవల్ల తలవొగ్గవలసి వొచ్చింది. వేలకువేలు సంపాదిస్తున్నాడు, కాంతారావు.

భర్త ఎంత సంపాదిస్తున్నా మా ఉష ప్రవర్తనలో ఏమీ మార్పురాలేదు. కాంతారావు తల్లి పెట్టని ఉక్కుగోడై అడ్డుతగిలింది. అంచాత ఉష ఉద్యోగస్థుని భార్యగా ఎన్నడూ అగుపించదు. ఆమెను చూసిన వాళ్ళకు మొదటగా తట్టే అనుమాన మేమిటంటే, కేవలం పిల్లల్ని కనటానికి జన్మ ఎత్తిందా? ఏటా ఒకకాన్పు. ఆమెలో అందం పిల్లలు కలిగిన కొద్దికీ హరించి పోతూన్నాది. చివరకు మిగిలేది - ఆ అస్థిపంజరమేమో! అనిపించక మానదు. జీవితంలో ఏగాఢ సన్నివేశానికి నోచుకోని మా ఉష లాంటి ఆడవాళ్ళని చూస్తుంటే 'ఆడజన్మ' సార్థకత - వంటగది పొగలో కళ్ళు నులుము కోవటంతోనూ, అసహ్యాన్ని తొలగించుకొని పిల్లలకు వెట్టిచాకిరీ చేయటంతోనూ తలనూనె రాచుకోలేని తీరికలేని పనులు చేయటంతోనూ, క్రమేపీ భర్తకు అనందానిచ్చే యంత్రంగా తయారుకావటంతోనూ, అనుక్షణమూ వ్యక్తిత్వాన్ని చంపుకొంటూ బానిసగా వ్యవహరించటంతోనూ, సరిపోతుందా? అనుపిస్తూంటుంది. జాలితలచక మానలేం.

కాంతారావు సంపాదన అట్లా వుండగా మా అత్తయ్యా మామయ్యల సంపాదనకూడా గణించ తగ్గది. మాఅత్తయ్య గేదె పాడిమీద నెలకు ఎట్లాలేదన్నా యాభై రూపాయలు వెనక వేస్తుంది. కోళ్ళుపెంచి, గుడ్లు అమ్ముతూ కొంత, పిడకలుచేసి బ్రాహ్మలకు అమ్ముతూ కొంత, అలగా వాళ్ళకి బియ్యం అమ్ముతూ కొంత మొత్తానికి చాలా సంపాదిస్తుంది. ఇక మామయ్య సంపాదన అంతా ఇంతాఅని చెప్పటానికి లేదు. ఊళ్ళో వడ్లమరలలోనూ, సినిమా హాల్లోనూ, కట్టెల అడితిలోనూ, భాగాలు ఉన్నాయి. అంతేకాక ఆయన ప్రత్యేక దృష్టితో చేసే వ్యాపారాలు కూడా మరికొన్ని ఉన్నాయి. ధాన్యం, అపరాలు, కొద్దిగా పసుపు వ్యాపారాలేకాక చాటుగా బంగారం వ్యాపారంకూడా ఉంది. ఆచివరివ్యాపారం విషయం అందరికీ తెలియదు. ఇంతసంపాదనా వేలసంఖ్యలోకి వెళుతోంది ఈ అస్తంతా రేపు మా ఉషకు పెట్టవలసిందేగా!

సంపాదించే వాడిమీద లోకానికి రెండు కళ్ళు ఉంటాయి కాని వీటిచూపులు వేరు ఒకచూపు అసూయ, కల్మషంతోనూ; మరోచూపు గౌరవం, అభిమానంతోనూ కూడుకొని వుంటుంది. ఆ మొదటి చూపుకు బెదరకుండా వుండేసామర్థ్యం కావాలి. అదిఉన్నరోజే సంపాదన పూర్తి చేయ గలుగుతాడు.

కాంతారావు లంచాలు విరివిగా తీసుకుంటున్నాడనే వాదం ప్రచారంలో ఉంది. అతను పై అంతస్థుకు తనతోటి వాళ్లు పోయినంత త్వరగా పోక పోవటానికి కారణం అదే. తనప్రవర్తనలోనిదుర్మార్గం కాంతారావుకు తేట తెల్లమైనా, ఉద్యోగరీత్యా అదికలిగించే ప్రతిబంధకం విపరీతమేయైనా— అతను చింతిల్లటం లేదు. డబ్బు సంపాదించటమే కావల్సింది. ఏ అంతస్థులో నుండైతేనేం?

“అబ్బాయీ! ఎన్నాళ్లుండా అక్కడేనా. పైకి పోయే అవకాశంలేదా?” అన్నాడు మామయ్య ఒకసారి ఉద్యోగాన్ని గురించి కాంతారావుతో.

“నా ప్రయోజకత్వం అధికారులకు నచ్చలేదు” అన్నాడు కాంతారావు.

మామయ్య మనస్సు చివుక్కుమంది. మళ్ళీ ఉద్యోగంలోని హెచ్చుతగ్గుల్ని గురించి మాట్లాడలేదు.

* * *

కాంతారావుకు వెంట్రుకలు నెరుస్తున్నాయి. మా ఉష ఇప్పుడు ఏడుగురు పిల్లల తల్లి అయింది. మామయ్య సంపాదన ఆగిపోయింది. సంపాదించింది చూసుకుంటూ మంచంలో పడి తీసుకుంటున్నాడు. ఇద్దరు పిల్లలు మా అత్తయ్య పెంపకంలో ఉన్నారు. కాంతారావు తండ్రి చనిపోయాడు. కాంతారావు తనఊళ్ళో పదెకరాల పొలం అదనంగా కొన్నాడు. ఉద్యోగం చేసే బస్తీలో అద్దెకొంపలో యాతన పడలేక, పదివేలు పెట్టి ఒక డాబా కొన్నాడు.

కాంతారావు సంపాదన తగ్గలేదు. పిల్లలు ఎదిగారు. ఒకడు స్కూలు ఫైనలు పరీక్షకు కూచున్నాడు. పెద్దమ్మాయి

పిఫ్తుఫారం చదువుతూంది రెండోవాడు థర్డుఫారం, మూడోవాడు సెకండుఫారం, రెండో అమ్మాయి అయిదో క్లాసు చదువుతూన్నది ఆ పిల్లల్ని ఎంత కట్టుదిట్టంతో, భయ భక్తులతో పెంచుతున్నారంటే—— ఒక్కడూ తలెత్తి మాట్లాడటానికి వీల్లేదు కాంతారావు తల్లి ఎంత ముసలిదైనప్పటికీ పెత్తనం ఆవిడదే. ఆవిడ మాట జవదాటే వాళ్ళు లేరు

మామయ్యకు అవసానదశ వచ్చింది బంధుసమూహపు మధ్య ఒకరోజున ప్రాణాలు విడిచాడు పోతూ పోతూ చాలా మిగిల్చి వెళ్ళాడు మామయ్య, అత్తయ్య ఒక్కత్తే వుండలేక ఇంటిని నెలకు పాతిక రూపాయలకు హైస్కూలు హెడ్ మాష్టరుకు అద్దెకిచ్చి ఉష దగ్గర ఉంటూన్నది

పెద్దవాడు స్కూలు ఫైనలు ప్యాసయ్యాడు కాలేజీలో చేరాడు పెద్ద అమ్మాయి పిఫ్తుఫారం ప్యాసు కావటం జరిగింది కానీ ఇకముందు చదవటానికి లేకపోయింది కారణం ఏమిటంటే పెద్దమనిషయింది అటువంటి పిల్లను చదివించటానికి కాంతారావూ, ఉషా అభిప్రాయాలు అవతలగా వుంచి కాంతారావు తల్లికి ఇష్టం లేకపోయింది మా అత్తయ్య ఏమీ చెప్పలేదు పెద్దవాడు, శివన్నారాయణలో కాలేజీలో చేరినాక కొన్ని మార్పులు జరిగాయి ఆ మార్పులు వాడిలో కలగటానికి కారణం, తాను బ్రతుకుతున్నది బావిలో తాబేలు బ్రతుకని తెలుసుకోవటం వల్ల ముఖ్యంగా సిగిరెట్లు త్రాగటం, దొంగతనంగా డబ్బులు మిగుల్చుకొని అధికంగా సినిమాలు చూడటం సాగిస్తున్నాడు ఈ విషయం కాంతారావు కంటె కాంతారావు తల్లి కనిపెట్టి కాంతారావుకు చెప్పింది, ఒకటికి నాలుగు

తన కళ్ళెదుట పిల్లవాడు చెడిపోవటం అయినకు పట్టరాని కోపం వచ్చింది చావచితక కొట్టాడు, ప్రేం బెత్తం తీసుకొని మా ఉష గుడ్లలో నీళ్లు కుక్కుకొని వూరుకుంది

మరినాలుగు సంవత్సరాలకు కాంతారావు తల్లి గతించింది పెత్తనం ఎవరి చేతుల్లోకి పోవాలి అన్న సమస్య బయలు దేరింది కాంతారావుకు తను పెత్తనం వహించటం బాగుండక, భార్యకిద్దామనుకున్నాడు అట్లానే ఇచ్చి చూశాడు కాని సంపాదన వెనుకబడే ఉపాయాలు తెలిసిపొదుపుగా వాడినాకూడా, ఆవిడ పెత్తనాన్ని సాగనివ్వలేదు పిల్లలు మాటిమాటికీ కావలసినవి కాస్త కూస్తకూ, దానికినీ, దీనికనీ- డబ్బులివ్వమని వేధించ సాగారు ఆ విషయం కాంతారావు కనిపెట్టి తాను లాక్కున్నాడు

* * *

కాంతారావు తన పెత్తనంలో చాలా విరివిగా సంపాదించాడు ఉద్యోగంలో రిటైరు అయినాడు శివన్నారాయణ యం బి, బి ఎస్ చదువుతున్నాడు పెద్ద పిల్లకు ఇద్దరు పిల్లలుకూడాను, మొగుడుకు బ్యాంకులో పని రెండో పిల్ల పెళ్ళిడుకు తయారుగా ఉంది రెండోవాడు కాలేజీలో చదువుతున్నాడు

కాంతారావుకు ఏమాత్రం శాంతి లేకుండా ఉంది చాలా సంపాదించాడు ఇన్నాళ్లూ సంపాదించాలనే ఆరాటంతో జీవించాడు దాన్ని భద్రపరిచేందుకు చింత లేదు. ఇప్పుడు ఆ చింతకూడా ఏర్పడింది. సంసారం చాల పెద్దదైంది సాధ్యమైనంతవరకు నేర్పుగా ఖర్చు తగ్గించుకొని డబ్బు నిలవ చేయాలి. భీతి ఫించను వస్తూవుంది

ఒక రోజు ఉదయం కాఫీ త్రాగి కుర్చీలో కూర్చుని ఆలోచనలో పడిపోయాడు, కాంతారావు.

తనకిప్పుడు వందెకరాల ఆస్తి ఉంది ఈ ఆస్తిని సంపాదించటంతోనే తన జీవితకాలమూ, సౌఖ్యము హరించిపోయినయ్ ఇంత ఆస్తికీ కుడిభుజాలుగా వున్న వియ్యంకుడూ, వియ్యాపురాలూ, తనతల్లీ చనిపోయారు కాని వాళ్ళు తమతో ఏమన్నా తీసుకెళ్ళారా? రేపు తనగతీ అంతే! ఇంత ఆస్తి సంపాదించాననే గర్వం, ఆనందం మిగులుతుంది చావబోయేటప్పుడు

కాని ఇంత సంపాదించినా రేపు తను చచ్చినతరువాత కొడుకులు పంచుకుంటే ఎంత వస్తుంది? మనిషికి పదెకరాలు కంటె రాదు సక్రమంగా పంచుకుంటారో లేదో ఎన్ని పోట్లాటలు జరుగుతాయో ఇదంతా యింత సంపాదించటం వల్లనేగా వెధవది ఎంత సంపాదించి మట్టుకు తనకు శాంతి యేది? ఎకరం ఆస్తి లేని కుటుంబం ఎంత నిశ్చింతగా బ్రతుకుతోంది? ఇంకా తనలో సంపాదించాలనే ఆరాటం చావలేదు సంపాదించటంతోనే తన జీవితకాలం ముగుస్తుంది.

కాని అనుభవించే ఆనందం ఏది? తనలో ఈ సంపాదించాలనే ఆరాటం లేకపోతే తన జీవితం సౌఖ్యాన్ని రుచిచూసేదేమో! ఈ సంపాదనకు అంతం ఎక్కడ? చావులో.

పిల్ల ఏడుపు విని ఉలిక్కిపడి లేచాడు ఆలోచననుంచి. భార్య అయిదో పిల్లను కొడుతూంది.

"ఎందుకే అట్లా చావచితక కొడతావు?" అన్నాడు కాంతారావు.

"చూడండి బజారుకెళ్ళి ఆరణాల దారపు వుండ తీసుకురమ్మని అర్థరూపాయి యిస్తే మిగిలిన బేడ పారేసి వచ్చింది" అన్నది మా ఉష.

"ఇంకా నాలుగు బాదు. బేడ పారేయటమా? కాస్త లేదూ దానికి అప్పుడే డబ్బు మీద అంత నిర్లక్ష్యమా!" అన్నాడు కాంతారావు కోపంగా. వెంటనే నాలుక కొరుక్కున్నాడు. ఏం బేడ పారేస్తే?

అభాగిని

(68-వ పేజీనుండి)

చూడు. నీకునచ్చిన పిల్లను పెండ్లి చేసుకుని సుఖపడు" అని ఒదార్చాడు మామ రామూన్ను.

ఆపదిరోజులు అక్కడేఉండి కమలదినం పూర్తిచేసుకుని ఇంటికితిరిగి వచ్చాడు. రామూ తల్లీ దండ్రీ మళ్లీ పెళ్లి చేసుకోమన్నారు. కాని అతనిమనస్సు ఒప్పుకోలేదు 'బ్రతికినన్నాళ్ళు సుఖపెట్టలేదు. చచ్చిపోయిన తరువాత కూడా ఆమె మనస్సుకు అశాంతి కలిగించలేను నాన్న" అంటూ యేడ్చాడు. అప్పటినుండి ఇంట్లో పెళ్ళిమాట యెత్తడానికే భయం.

ఈ కథంతా సంవత్సరం క్రిందజరిగింది. మామగారు వ్రాసిన ఉత్తరంచూచి అంతాతల్చుకుని యేడుస్తున్నాడు రామూ! ఇంతలో వెనకనుంచి తనభుజం తట్టినట్లు గ్రహించి వెనక్కి తిరిగిచూచాడు. పదినెలలు మోసికన్న తల్లి కనపడింది. ఆమాతృశ్రీని చూచి "అమ్మా" అంటూ యేడ్చాడు.

"ఏడిస్తే యేమన్నా మనకోసంవస్తారా చెప్పు నాయనా! కవి అన్నతరవాత చచ్చితీరాల్సిందేగా! కొంచెం ముందు వెనుక అంతే. ఇదంతా మర్చిపోయి సంవత్సరీకానికి మామయ్య ఊరికి బయలుదేరునాయనా. కండ్లుతుడుచుకో తప్పు" అని చెప్పింది మాతృశ్రీ.

ఆమాటలువిని రామూ కండ్లు తుడుచుకుని అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

★

★

ప్రస్తుతం ఇండియాలో పని చేస్తున్న ముగ్గురు న్యూజీలండ్ నర్సులు. వీరు కొలంబో ప్లాన్ క్రింద మన దేశానికొచ్చారు. పైపటంలో వారు న్యూజీలండ్‌లోనున్న సిలోనీస్ డెంటల్ నర్సు ట్రైనీలతో సంప్రదిస్తున్నారు.

★